జిల్లా కోర్టులో అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జిల్లా కోర్టు కాంప్లెక్స్, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల కోసం దామినేడు వద్ద రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూములను ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య, ఆర్ డి ఓ రామ్మోహన్, రెవెన్యూ, నీటిపారుదల, ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు మంగళవారం పరిశీలించారు. జిల్లా కోర్టు కాంప్లెక్స్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధితో పాటు, పరిసర ప్రాంతాల అభివృద్ధికి చేయాల్సిన ప్రణాళికలపై చర్చించారు. ఈ ప్రతిపాదిత రహదారికి సమీపంలో ఉన్న ఇతర భూములన్నింటికీ అవకాశం కల్పించడం కోసం 30 మీటర్ల రహదారి నిర్మాణానికి సంబంధించిన దామినేడు మాస్టర్ ప్లాన్ రోడ్డు అలైన్‌మెంట్‌ను పరిశీలించి త్వరాగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు పలు సూచనలు చేశారు. కమిషనర్ వెంట తుడా సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఈ.ఈ. రవీంద్ర, పి.ఓ. దేవి కుమారి, నీటిపారుదల శాఖ ఈ.ఈ.శివారెడ్డి, రూరల్ తహసీల్దార్ జనార్దన్ రాజు, తదితరులు ఉన్నారు.

జిల్లాల పునర్విభజన కాదు.. ఇది రాజకీయ విభజన

- నేదురుమల్లి

ప్రజాశక్తి - వాకాడు: వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి వాకాడులోని వారి నివాసం వద్ద మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లాల పునర్విభజన ప్రజాభిప్రాయానికి భిన్నంగా ఉందని, ప్రాథమిక నోటిఫికేషన్‌లో ఓ విధంగా, క్యాబినెట్ ఆమోదం అందుకు భిన్నంగా ఉందని తెలిపారు. తుది నోటిఫికేషన్లో మార్పులు చేర్పులకు అవకాశం లేకపోలేదని ఊహాగానాలు గూడూరు నియోజకవర్గం విభజన విషయంలో ప్రభుత్వం స్పష్టత లేకుండా భిన్న ప్రతిపాదనలను ముందుకు తెస్తుండటం ప్రజల్లో అయోమయాన్ని పెంచుతోందన్నారు. ఒకదశలో గూడూరు నెల్లూరులో అని, మరో దశలో లేదు లేదు తిరుపతి జిల్లాలోనే అని, గూడూరు జిల్లా అంటూ మరో ప్రతిపాదన, తాజాగా గూడూరు నియోజకవర్గం రెండుగా చీల్చడం వెనక రాజకీయ ప్రయోజనాలే అని భావించాల్సి వస్తుందన్నారు. ఈ నెల 31న రాబోయే తుది నోటిఫికేషన్ వెలువడిన తర్వాత సమగ్రంగా వైఎస్ఆర్సీపీ వైఖరి వివరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా సీఈసీ సభ్యులు కోడవలూరు ధనుంజయ రెడ్డి, వైఎసిపిమండల అధ్యక్షులు ఏనుగు సుధాకర్ నాయుడు, వాకాడుసర్పంచ్, ఉప సర్పంచ్ పాప రెడ్డి రాజశేఖర్ రెడ్డి, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, వైసీపీ నాయకులు

వైకుంఠ ద్వార దర్శనానికి క్యూకట్టిన ప్రముఖులు







ప్రజాశక్తి - తిరుమల: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సామాన్య భక్తుల దగ్గర నుంచి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో పాటు రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, సినీ సెలబ్రిటీలు, టీం ఇండియా క్రికెటర్లు తిలక్ వర్మ, సూర్య కుమార్ యాదవ్ ఆలయానికి క్యూ కట్టారు. ముఖ్యంగా తెలుగు మూవీ స్టార్స్ శ్రీలీల, శివాజీ, మెగా స్టార్ ఫ్యామిలీ నుంచి చిరంజీవి సతీమణి సురేఖ, నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర, నారా రోహిత్ జంట, మాజీ మంత్రి రోజా, ఓజీ నిర్మాత దానయ్య, నటి హేమ, బండ్ల గణేశ్ ఇలా అనేక మంది వేకువ జామునే తిరుమల శ్రీవారిని ఉత్తర ద్వార దర్శం చేసుకున్నారు. శ్రీలీల స్వామి వారి దర్శనం చేసుకుని తిరిగి వెళ్లిపోతున్న క్రమంలో అభిమానుల తాకిడి ఒక్కసారిగా ఎక్కువయింది. వెంటే సెక్యూరిటీ గార్డ్స్ ఉండి పబ్లిక్‌ను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ చాలామంది ఫొటోలు,సెల్ఫీల కోసం ఎగబడ్డారు.

మద్యం విక్రయ వేళలు పొడిగింపు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా పరిధిలో మద్యం విక్రయాల సమయాలను పొడిగించామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి తెలిపారు. ఎ4 మద్యం దుకాణాలకు 2025 డిసెంబర్ 31న అర్ధరాత్రి 12 గంటల వరకు, 2026 జనవరి 1న అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం విక్రయాలకు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. 2బి బార్లు, సి1 (ఇన్ హౌస్)లైసెన్సులు, ఇపి1 (ఈవెంట్ పర్మిట్), ఏపీటీడీసీకి చెందిన టీడీ1(ఇన్ హౌస్) లైసెన్స్ కలిగిన సంస్థలకు 2925 డిసెంబర్ 31 అర్ధరాత్రి 1 గంటల నుండి 2026 జనవరి 1వ తేదీ అర్ధరాత్రి 1గంటల వరకు మద్యం అమ్మకాలు జరిపే విధంగా అనుమతులు మంజూరు చేశామన్నారు. ప్రభుత్వానికి డ్యూటీ చెల్లించని మద్యం విక్రయం, అక్రమ మద్యం నిల్వలు, అక్రమ విక్రయాలు పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమయపాలన పాటించాలి : ఐద్వా, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మద్యం అమ్మకాల సమయపాలన పాటించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయి లక్ష్మి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులుఎం.నరేంద్ర ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ సీఎం నూతన సంవత్సర సందర్భంగా అర్ధరాత్రి ఒంటి గంట వరకు మద్యం అమ్మచ్చని అనుమతులు ఇవ్వడం సబబు కాదన్నారు. మద్యాన్ని ఆదాయ వనరుగా చూడకుండా యువతను కాపాడాల్సిన బాధ్యతను విస్మరించి ఇలా మాట్లాడడం దుర్మార్గమని ఆరోపించారు. నూతన సంవత్సర వేడుకల పేరుతో యువత మద్యం సేవించి అరాచకాలకు పాల్పడడం, మహిళలను ఇబ్బంది పెట్టడం, ప్రమాదాల బారిన పడటం వంటి ఘటనలు గతంలో జరిగాయని గుర్తు చేశారు. వీటిని పరిగణలో తీసుకొని అలాంటి వాటికి అవకాశం లేకుండా ఉండే విధంగా 31వ తేదీ సాయంత్రం 7:00 కు మద్యం అమ్మకాలను నిలిపివేయాలని, అదేవిధంగా ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖవారు చర్యలు చేపట్టాలని కోరారు.

వాకర్స్ నుండి వసూళ్లు ఆపండి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : తిరుపతి నగరంలోని దివ్య రామం ఎస్వీ నగరవనంలో వాకర్స్ నుండి డబ్బులు వసూళ్లు చేయడాన్ని ఆపాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు తిరుపతి జిల్లా కమిటీ కార్యదర్శి వందవాసి నాగరాజు జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులుకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నడకకు కూడా నగదు వసూలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఒకవైపు యోగా చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోమని చెబుతూ మరోవైపు ఉదయాన్నే నడక ద్వారా యోగా ద్వారా ఇతర వ్యాయామాల ద్వారా ఆరోగ్యాన్ని బాగు చేసుకుందామని కృషి చేస్తున్న సీనియర్ సిటిజన్స్, షుగర్ పేషెంట్లు ఇతర వ్యాధిగ్రస్తులు అందరి మీద డబ్బులు వసూళ్లు చేయాలని దురాలోచన ఫారెస్ట్ అధికారులు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఫారెస్ట్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఇటువంటి ఆదేశాలు ఇచ్చారాని ప్రశ్నించారు. తిరుపతి ఎమ్మెల్యే నివాసం పక్కనే ఉన్న నగరవనంలో ఇలా జరుగుతుంటే చూసీ.. చూడనట్టు ఉండడం తన ఆమోదాన్ని తెలపడం కాదని ప్రశ్నించారు. తెలుగుదేశం లేదా బిజెపి పార్టీలు ప్రజల మీద భారాల మోపడాన్ని స్వాగతించడం సిగ్గుచేటన్నారు.



రెవెన్యూ అధికారి నరసింహులుకు వినతి పత్రం అందిస్తున్న సిపిఎం తిరుపతి జిల్లా కమిటీ కార్యదర్శి వందవాసి నాగరాజు

కులగణన తర్వాత దేశంలో మార్పులు వస్తాయి

బీసీ బిల్లు కోసం జేఏసీ ఏర్పాటు చేస్తాం: ఎంపీ ఆర్.కృష్ణయ్య

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): 76 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో వెనుకబడిన తరగతుల వర్గాలకు చెందిన ప్రజలు కులగణన తరువాత రాజ్యాధికారం పొందబోతున్నారని, కులగణన తరువాత దేశంలో గొప్ప మార్పులు వస్తాయని రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య అభిప్రాయపడ్డారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు దేశంలో కుల గణన జరగకపోవడం వలన సగభాగం జనాభా పేదరికం, అమాయకత్వంతో జీవిస్తున్నారని, గడిచిన ప్రభుత్వాలు అవలంబించిన నిర్ణయాలతో నలిగిపోయారన్నారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం జనగణన, కుల గణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ అంశం అన్నారు. ఇన్నేళ్ల కాని ఏది సంపన్నులు దేశంలో జరగడంతో అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి గొప్ప స్థానం లభించిందన్నారు. రాష్ట్రంలో కూడా ఎన్నికల హామీలో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికలలో అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విద్యతోనే సమాజంలో సమూల మార్పులు వస్తాయన్న అంశంతో గురుకుల పాఠశాలలు, బీసీ హాస్టళ్ళు, స్కాలర్షిప్పులతో విద్యను అభ్యసించిన విద్యార్థులు నేడు సమాజానికి దిక్సూచిగా మారారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు హైకోర్టులలో, ప్రైవేట్ సెక్టార్ లో ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల లక్ష్యంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం దశాబ్దాలుగా పోరాటాన్ని నడుపుతోందన్నారు. 2600 ఉప కులాలు ఉన్న బీసీల్లో కేవలం 40 కులాలు మాత్రమే పార్లమెంటులో అడుగుపెట్టాయంటే బీసీలు ఏ విధంగా అణిచివేతకు గురవుతున్నారో అర్థం పడుతుందన్నారు. త్వరలో ఐదు నుండి 10 లక్షల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నమన్నారు. కులగణలో భాగంగా వెనుకబడిన తరగతులలో ఉన్న సంచార జాతులు లెక్కల్లోకి రానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జల్లి మధుసూదన్, శ్రీధర్, మల్లేష్, శశికుమార్, రాజశేఖర్, సురేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ కేటాయించకపోవడం దారుణం : సిపిఎం

ప్రజాశక్తి - సత్యవేడు: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాలలో మండలాల చేరిక, కొత్త రెవిన్యూ డివిజన్ల ఏర్పాటు వంటి మార్పులతో కూడిన జాబితాకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గానికి అన్యాయం జరిగిందని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శులకు సభ్యులు దాసరి జనార్ధన్ పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో కొన్ని మండలాలు చేరినప్పటికీ రెవిన్యూ డివిజన్ సంఖ్య పెంచకపోవడం వల్ల రెవెన్యూ డివిజన్లపై భారం పెరగడం తప్ప ప్రజలకు సకాలంలో పనులు జరగవన్నారు. కొత్త జిల్లాలు ప్రకటించిన నేపథ్యంలో 28 మండలాలు ఉన్న చిత్తూరు జిల్లాలో నాలుగు రెవిన్యూ డివిజన్లో 30 మండలాలు ఉన్న నంద్యాల జిల్లాలో నాలుగు రెవెన్యూ డివిజన్లను కేటాయించి 36 మండలాలున్న తిరుపతి జిల్లాలో కేవలం 3 రెవెన్యూ డివిజన్లే కొనసాగించటం బాధాకరమన్నారు. జిల్లాలో అధికార పార్టీ నాయకుల ఉదాసీన వైఖరి వల్ల మరో రెవిన్యూ డివిజన్ కేంద్రం ఏర్పాటును కోల్పోవలసి వచ్చిందన్నారు. కోడూరు నియోజకవర్గం పూర్తిగా గూడూరు నియోజకవర్గంలోని రెండు మండలాలు తిరుపతి జిల్లాలో కలిసినప్పటికీ రాష్ట్రంలో అతిపెద్ద జిల్లాగా తిరుపతి అవతరించినప్పటికీ కేవలం 3 రెవిన్యూ డివిజన్ లోనే కొనసాగించడం దారుణమన్నారు. ప్రజలకు రాజకీయ నాయకులకు అధికారులకు పరిపాలన సౌకర్యంకోసం సత్యవేడు కేంద్రంగా మరో కొత్త రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర జట్టులో ఎమరాల్డ్స్ విద్యార్థికి చోటు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎన్టీఆర్ జిల్లాలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 విభాగం క్రికెట్ పోటీలలో తిరు పతి జిల్లా నుండి ఎమరాల్డ్స్ విద్యా ర్థి రుక్సర్ తబుస్సం అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టులో స్థానం సాధించినట్లు కళాశాల డైరె క్టర్లు గిరిధర్, విశ్వనాథ్ తెలిపారు. జిల్లాస్థాయిలో జరిగిన పోటీలలో డబుల్ హ్యాట్రిక్ సాధించి రుక్సర్ అందరి దృష్టిని ఆకర్షించిందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలలో జరిగే పోటీల్లో కూడా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తు న్నామన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్లు మునిరత్నం, జానకిరామ్, శ్రీనివాసులు, నాదముని పాల్గొన్నారు.

రుక్సర్ తబుస్సంను అభినందిస్తున్న దృశ్యం

అన్న కాంటీన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : అన్న కాంటీన్ల పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ ఎన్.మౌర్య నిర్వాహ కులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం నగరంలోని ఈ ఎస్ ఐ హాస్పిటల్ వద్దఉన్న అన్నా కాంటీన్‌ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. టోకెన్లు ఎన్ని ఇచ్చారని అడిగి, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఒక్కొక్కరికి టోకెన్ ఇవ్వాలని తెలిపారు. ఆహార పదార్థలను నాణ్యతతో, నిర్ణిత సమయంలో పంపిణీ చేయాలని తెలిపారు. పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆహార పదార్థాలు వృధా చేయకుండా తగినంత మాత్రమే తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

- రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - క్యాంపస్ : నకిలీ వరి విత్తనాలతో నష్టపోయిన సుళ్లూరుపేట, తడ, దొరవారి సత్రం, వరదయ్యాపాలెం మండలాల రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని రైతు సంఘం నాయకులు సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు, ప్రవీణ్ కుమార్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన ఎంక్వైరీ కమిటీ సభ్యులు గరిష్టంగా ఎకరాకు రూ.62,000, కనిష్టంగా 50,000 తగ్గకుండా నష్టపరిహారం చెల్లించాలని నివేదిక ఇచ్చారని తెలిపారు. నెల రోజుల లోపల పరిహారం చెల్లిస్తామని డిసెంబర్ 16న విచారణ కమిటీ రైతులకు హామీ ఇచ్చిందని, కానీ ఇంతవరకు ఏ ఒక్క రైతుకు నష్ట పరిహారం చెల్లించలేదని తెలిపారు. జనవరి 13వ తేదీలోగా రైతులకు పరిహారం చెల్లించకపోతే, సంక్రాంతికి నారావారిపల్లికి విచ్చేయనున్న సీఎం వద్దకు తరలి వెళ్తామని హెచ్చరించారు.

వాణిజ్యశాస్త్రంలో కీర్తికి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వాణిజ్య శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని గుత్తా కీర్తికి పీహెచ్‌డీ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు సీఈ బి.రాజమాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్ విభాగంలో ఆచార్య పీవీ.నరసయ్య మార్గదర్శకంలో "ఇంపాక్ట్ ఆఫ్ వర్కింగ్ క్యాపిటల్ మేనేజ్మెంట్ ఆన్ ప్రాఫిటబిలిటీ ఇన్ సెలెక్ట్ ఎఫ్ఎంసిజి కంపెనీస్ ఇన్ ఇండియా" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. ఆమె పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్ లో అనేక పరిశోధనా పత్రాలను ప్రచురించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వాణిజ్య శాస్త్ర విభాగానికి చెందిన ఆచార్యులు, పరిశోధకులు కీర్తికి అభినందనలు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వాల మోసం

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యస్వీయులో జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఏర్పడి 55 వసంతాలు పూర్తి చేసుకుని 56వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో మంగళవారం ప్రకాశం భవనం ఎదుట జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించి, కేకులు కోసి విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు మాతేశ్వరి స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే అక్షరాలతో కూడిన ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, రాష్ట్ర యూనివర్సిటీల కో–కన్వీనర్ అశోక్ కుమార్, వర్సిటీ కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ విద్యార్థుల త్యాగాల ఫలితంగా ఎస్ఎఫ్ఐ ఏర్పడిందని తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థులను మోసం చేయడంలో టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు ఒకటే విధానాన్ని అనుసరిస్తున్నాయని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని అడ్డుకుంటామని, విద్యను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను తక్షణమే వెనక్కి తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో కొందరు ఆచార్యులు బోధన, పరిశోధనలను పక్కనపెట్టి రాజకీయ నాయకుల భజనలో నిమగ్నమై పదవుల కోసం ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులను మెప్పించేందుకు వారి అనుచరులకు అక్రమంగా ఉద్యోగాలు కల్పిస్తున్నారని ఆరోపించారు. హాస్టల్ మెయింటెనెన్స్ పేరుతో విద్యార్థులపై అదనపు భారాలు మోపుతూ, వచ్చిన నిధులను తమ అనుచరులకు కాంట్రాక్టుల రూపంలో దోచిపెడుతున్నారని విమర్శించారు. ఈ సమస్యలన్నింటిపై భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తామని, విద్యార్థులంతా స్వచ్ఛందంగా పాల్గొని తమ హక్కుల కోసం గళం విప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఆఫీస్ బేరర్స్ తేజ, రెడ్డి కుమార్, యూనివర్సిటీ గర్ల్స్ కన్వీనర్ లక్ష్మి, నాయకులు తిరుమలేష్, చక్రి, మేఘన,పవన్, అనురాధ, మంజుల, సింధు, షేక్షావలి, విద్యార్థులు పాల్గొన్నారు.

గోల్ మాల్ నిధుల గుట్టురట్టు

సామాజిక తనిఖీ ప్రజావేదికలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -దొరవారిసత్రం: గ్రామీణ నిరుపేదల ఉపాధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై జిల్లా పిడి శ్రీనివాసరావు సారధ్యంలో అధికారుల బృందంతో దొరవారిసత్రం మండల కేంద్రంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో 2025 జనవరి నుండి డిసెంబర్ వరకు జరిగిన ఉపాధి పనులు, నగదు చెల్లింపులపై జరిగిన ఆధారాలతో కూడిన రికార్డులను ఏపీడి ప్రేమ్ కుమార్, విజిలెన్స్ అధికారి గణేష్, క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీనివాసులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఏ గ్రామ పంచాయతీలో ఎన్ని పనులకు ఎంత నిధులు కూలీలకు చెల్లించిన వాటి వివరాలను పరిశీలించడం జరిగింది. ఉపాధి పథకానికి విరుద్ధంగా బిల్లులు చెల్లించిన 1.20 వేల రూపాయలు కూలీలకు చెల్లించినట్లు అధికారులు గుర్తించి, వెంటనే వాటిని జమ చేయకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనియాలి గ్రామ పంచాయితీలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ ఆ గ్రామంలో వివిధ కంపెనీలలో పని చేస్తున్న వారికి బ్యాంకు మిత్ర ఉద్యోగికి ఉపాధి హామీ కార్డు సృష్టించి, పనికి వచ్చినట్లు మాస్టర్ రోల్‌లో నమోదు చేసి నగదు చెల్లించిన అవినీతి అక్రమాన్ని గుట్టు రట్టు చేశారు. ఆమెపై సస్పెండ్ వేటు వేశారు. పనిలో పాల్గొన్న వారు కొందరైతే, మరెందరికో మస్టర్ వేస్తూ ఆర్థికంగా లబ్ధి పొందిన ఫీల్డ్ అసిస్టెంట్లు ఎందరో ఉన్నారు. పనులు జరుగుతున్న ప్రాంతాలను పర్యవేక్షిస్తూ, అక్కడ జరుగుతున్న లోటుపాట్లను ఏపీఓ గుర్తించి చర్యలు చేపట్టాలని తనిఖీ బృందం ఆదేశించింది. పేదల ఉపాధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని క్రమ పద్ధతిలో నిర్వహిస్తూ,న్యాయమైన రోజువారి కూలీ పనిచేసిన వారికి అందేలా చూడాలని సూచించారు. పలు పర్యాయాలు గతంలో జరిగిన సోషల్ ఆడిట్లో కూడా నిధులు దుర్వినియోగం చేసిన ఫీల్డ్ అసిస్టెంట్‌లపై చర్యలు చేపట్టి సస్పెండ్ అయిన విషయం విదితమే. ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి హామీ పథకంలో అవినీతి అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకోవడంతో పాటు, వారి తొలగిస్తామని అధికారుల హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీసీ పిడి శ్రీనివాసరావు, ఏపీ ప్రేమ్ కుమార్, విజిలెన్స్ అధికారి గణేష్, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎంపీడీవో గోవర్ధన్, ఏపీవో ఉషారాణి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన చిట్టిబాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌడపేరు చిట్టిబాబు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం తిరుపతి జిల్లాకు విచ్చేసిన రేవంత్ రెడ్డి ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

కేంద్రమంత్రి రామ్మోహన్‌కు ముక్కంటి ప్రసాదాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు స్థానిక రేణిగుంట విమానాశ్రయంలో మంగళవారం ఘన స్వాగతం పలికారు. రామ్మోహన్ నాయుడు ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని తిరుమల పర్యటన నిమిత్తం రాగా, చెంచయ్య నాయుడు ముక్కంటి తీర్థప్రసాదాలు అందజేశారు.

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం యుటిఎఫ్ శ్రీకాళహస్తి డివిజన్ 2026 క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. జిల్లా కోశాధికారి మోహన్ బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తోందని తెలిపారు. సంవత్సర కాలంలో ప్రభుత్వం ఇచ్చే జీవోలను పుస్తక రూపంలో అందించడం జరుగుతుందన్నారు. శ్రీకాళహస్తి డివిజన్ కన్వీనర్ వెంకట కృష్ణయ్య, సీనియర్ నాయకులు శ్రీనివాసులు, సూర్య ప్రకాష్, జిల్లా కార్యదర్శులు హేమాంబరధరరావు, విజయశ్రీ, ఆడిట్ కమిటీ సభ్యులు శివకుమార్, దీపిక, గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వరదయ్యపాలెం : మండల పరిధిలోని విద్యాశాఖ కార్యాలయంలో యుటిఎఫ్ 2026 డైరీ, క్యాలెండర్‌ను ఎంఈఓ గున్నయ్య చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శశికుమార్, సురేష్ భగవాన్‌లు మాట్లాడుతూ రానున్న నూతన సంవత్సరంలో విద్యావ్యవస్థలో మార్పులకు సహకరిస్తూ మండలంలో విద్యా ఉన్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురప్ప, ఋష్యేంద్ర, శివారెడ్డి, కొండలరావు, రాజు, సుబ్రహ్మణ్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో రోడ్డు నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి -ఏర్పేడు : చిందేపల్లి, తిరువడ గ్రామ ప్రజల 15 సంవత్సరాల కల నెరవేరిందని సర్పంచ్ చెన్నారావు పెంచలయ్య సంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ప్రజా శక్తితో మాట్లాడుతూ, 20 ఏళ్ల క్రితం సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారని కానీ అది పూర్తిగా ధ్వంసమై గత 15 ఏళ్ల నుండి వర్షం వస్తే నీరు నిల్వ ఉండి చెరువులను తలపించేదన్నారు. వర్షాకాలంలో అంగన్వాడి స్కూల్ కు వెళ్లాలంటే పిల్లల అవస్థ వర్ణనాతీతమని తెలిపారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి దృష్టికి ఈ సమస్యను పలుమార్లు తీసుకెళ్లడం జరిగింది. దీంతో ఎంపీ స్పందించి ఐదు లక్షల రూపాయలు ఎంపీ నిధులను మంజూరు చేయించారని తెలిపారు. ఈ నిధులతో 120 మీటర్ల సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తయిందని తెలిపారు.

భూముల రీసర్వేకు సహకరించండి

రైతులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - రామచంద్రపురం : భూముల రీసర్వేకు రైతులందరూ సహకరించాలని తహశీల్దార్ మధుసూదన్ రావు కోరారు. మంగళవారం మండలంలోని రాయలచెరువు, గంగిరెడ్డిపల్లి రెవెన్యూ గ్రామాలలో నాలుగో విడత భూ రీసెర్వేపై రాయల చెరువులు, గంగిరెడ్డిపల్లి గ్రామాలలో రైతులతో కలిసి ర్యాలీ, గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ రీ సర్వేకు సంబంధించి సంబంధిత రైతులందరికీ ముందస్తుగా నోటీసులు అందజేస్తామని తెలిపారు. రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ అమృత మాట్లాడుతూ నోటీసులు తీసుకున్న రైతులందరూ సర్వే సమయానికి తప్పక హాజరు కావాలని కోరారు. భూ రీ సర్వే తో గ్రామాలలో భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రీ సర్వే ద్వారా భూమి సరిహద్దులు, ప్రభుత్వ భూములు గుర్తించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అత్తూరు దామోదర్ రెడ్డి, మాజీ సర్పంచ్ నాగభూషణం, నాదముని యాదవ్, ప్రభాకర్ రాయల్, మండల డిప్యూటీ సర్వేయర్ తరుణ్ వీఆర్వో గాలి గుణ భూషణ్ నాయుడు, జి. రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

నేడు పిచ్చాటూరులో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: మండలంలోని స్థానిక పిచ్చాటూరు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు కొత్త లైన్ ఎరెక్షన్ వర్క్ వలన విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పిచ్చాటూరు మండల విద్యుత్ శాఖ ఏఈ సుబ్రహ్మణ్యం రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అంబేద్కర్ భవన్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. రేణిగుంట మండలం, గురవరాజు పల్లిలోని స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో నిర్మాణం ఏర్పాటుకు ఈ కమిటీ ముందుండి పనిచేస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా, నగేష్, గౌరవ సలహాదారులుగా, డాక్టర్ గౌరీబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్ ఐజయ్య, ప్రెసిడెంట్ నెల్లూరు సుబ్రహ్మణ్యం, జనరల్ సెక్రెటరీ , డి జూలియన్ రాజు, కోశాధికారి ప్రతాప్ కుమార్, ఉపాధ్యక్షులు, మునిరత్నం, చలపతి, నరేష్ ,వరలక్ష్మి, దేవీమోహన్ సహాయ కార్యదర్శిలు, సెల్వరాజ్, బాబుమేస్త్రి, గంగాధరం, రాజేంద్ర, ఫణిభూషణ్, కమిటీసభ్యులు రంగయ్య, లక్ష్మీ, ఇన్బానాధన్, కృష్ణమూర్తి, నాగార్జున, చైతన్య, సాగర్, కే లక్ష్మీనారాయణ, పురుషోత్తం తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఈ అంబేద్కర్ భవనం ఎంతగానో దోహద పడుతుందని వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్ ఐజయ్య తెలియజేశారు.

మా ఇంటి స్థలానికి రక్షణ కల్పించండి

ప్రజాశక్తి - వెంకటగిరి : బాలాయపల్లి మండలం, జయంపు గ్రామస్తులు పొదలకూరు వెంకటేశ్వర్లు నాయుడు, పొదలకూరు వెంకట సాయి సందీప్ తమ ఇంటి స్థలాన్ని కొందరు రాజకీయ పలుకుబడితో దౌర్జన్యంగా ఆక్రమించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై మంగళవారం వెంకటగిరి పట్టణం, కాసిపేట, సిఐటియు కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సిఐటియు తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ జయంపు గ్రామంలో సర్వే నెంబర్ 158-1, 158-7లలోగల 45 అంకణాల ఇంటి స్థలం గత 24 సంవత్సరాలుగా పొదలకూరు వెంకటేశ్వర్లు నాయుడు, పొదలకూరు వెంకట సాయి సందీప్‌ల అనుభవంలో ఉందన్నారు. అదే గ్రామానికి చెందిన పండ్లూరు కృష్ణారెడ్డి, పండ్లూరు శ్రీనివాసులు రెడ్డి, పండ్లూరు భాను ప్రకాష్ రెడ్డి, పండ్లూరు జయమ్మ, బి లక్ష్మీ ప్రసన్న, కుందాం తులసమ్మ అనువారు రాజకీయ పలుకుబడితో ఆ స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. సదరు విషయమై పొదలకూరు వెంకట సాయి సందీప్‌లు బాలాయపల్లి పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారని తెలిపారు. కానీ తహశీల్దార్ ప్రొటెక్షన్ ఉంటేనే వస్తామంటూ పోలీసులు తప్పించుకుంటున్నారన్నారు. ఎంపిడిఓ, తహశీల్దార్ వంటి మండల స్థాయి అధికారులు ఒకరిపై ఒకరు నెట్టేస్తూ బాధితుడికి న్యాయం చేయడంలో విఫలమయ్యారన్నారు. తక్షణమే పోలీస్ రక్షణ, రెవెన్యూ విచారణ, అక్రమ ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుత్తూరు శేషసాయి విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తిరుపతి జిల్లా తిరుపతిలో విశ్వం ఎడ్యుటెక్ వారు నిర్వహించిన వేదిక్ మ్యాథ్స్, అబాకస్ పోటీల్లో పుత్తూరు, శేష సాయి హైస్కూల్ విద్యార్థిని, విద్యార్థులు విశిష్ట ప్రతిభ కనపరిచారు. జిల్లా స్థాయిలో వివిధ పాఠశాలల నుండి 60 మందికిపైగా విద్యార్థులు పాల్గొనగా 8వతరగతి చదువుతున్న విద్యార్థి హరి ప్రసాద్ వేదిక్ మ్యాథ్స్‌లో మొదటి బహుమతి అందుకున్నాడు. అబాకస్‌లో ఒకటవ తరగతి చెందిన శ్రీశాంత్ మొదటి స్థానం, ఐదవ తరగతి విద్యార్థి మిథాన్ మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. పాఠశాల ఇన్చార్జి కరస్పాండెంట్ ఇంద్రజిత్తు, డైరెక్టర్లు రమేష్, జయప్రకాష్, సుబ్బయ్య, మనోజ్, శారదా నరసింహన్, ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ బాబు, ఏడికె భానుమూర్తి, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు విజేతలను అభినందించారు.

బడికెళ్లేదెట్టా.. సారూ..?

- కిక్కిరిసిన ఆర్టీసీ బస్సులు
- సీట్లు లేక ఇక్కట్లు
- ప్రమాదకర ఫుట్‌బోర్డు ప్రయాణం
- కళాశాలకు ఆలస్యం : విద్యార్థులు

ప్రజాశక్తి - పిచ్చాటూరు:తిరుపతి జిల్లా పిచ్చాటూరు, కె.వి.పురం, నాగలాపురం, నింద్ర మండలంలో ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు పుత్తూరులోని విద్యాసంస్థలకు చేరుకోవాలంటే రోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల కొరత కారణంగా ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు కిక్కిరిసిన ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. నిలబడేందుకు కూడా చోటు లేకపోవడంతో, ప్రమాదకరమైన ఫుట్‌బోర్డు ప్రయాణాలు చేస్తున్నారు. ఉదయం వచ్చే కొద్దిపాటి బస్సులు కూడా రద్దీగా ఉండటంతో విద్యార్థులు సమయానికి కళాశాలలకు చేరలేకపోతున్నారు. సాయంత్రం ఇంటికి చేరాలన్నా గంటల తరబడి ఆలస్యం అవుతోందని వాపోతున్నారు. బస్సుల కోసం పడిగాపులు కాస్తూ, వచ్చిన బస్సుల వెనుక పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొనింది. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఆర్టీసీ బస్సులు తప్ప మరో మార్గం లేకపోవడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక్కో బస్సులో 100 మందికి పైగా విద్యార్థులు ప్రయాణిస్తున్నారని చెబుతున్నారు. కనీసం నిలబడేందుకు కూడా అవకాశం లేకపోవడంతో ఊపిరాడకుండా ప్రయాణం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిసినా, కళాశాలలకు చేరుకోవాలంటే ఫుట్‌బోర్డు ప్రయాణమే మార్గంగా మారిందని విద్యార్థులు చెబుతున్నారు. ఈ సమస్యను ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కనిపించడం లేదని తెలిపారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు బస్సులు నడపాలని, ముఖ్యంగా ఉదయం సాయంత్రం పీక్ అవర్స్‌లో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల భద్రత దృష్టిలో పెట్టుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

35 కిలోమీటర్లు నిలబడే ప్రయాణం

నేను నాగలాపురం మండలం నుంచి పుత్తూరుకి డిగ్రీ కాలేజీకి వెళ్తున్నాను. పిచ్చాటూరు బస్టాండ్‌లో సత్యవేడు బస్సు కోసం ఉదయం వేచి ఉన్న బస్సు మొత్తం ప్రయాణికులు నిండిపోయి కూర్చోండడానికి సీట్లు లేక రోజు పుత్తూరు కాలేజీ చేరుకోవాలంటే 35 కిలోమీటర్లు నిలబడే ప్రయాణిస్తున్నాను. ఆర్టీసీ యాజమాన్యం ఆదనపు బస్సులు కల్పించాలి.

- గోపి కుమార్, విద్యార్థి, నాగలాపురం మండలం

జిల్లా అధికారులు స్పందించాలి

పిచ్చాటూరు నుంచి రోజు 25 కిలోమీటర్లు ప్రభుత్వ ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తున్నాం. రోజు బస్సుల్లో సీట్లు లేక బస్సు సంఖ్య కన్నా అదనంగా వందమంది విద్యార్థులతో ప్రయాణం చేయుట చాలా ఇబందిగా ఉంటోంది. పేద విద్యార్థులైన మేము ప్రభుత్వ కల్పించిన బస్సు పాసులో ప్రయాణం చేయుటకు ఉండేది ఒకే మార్గం, అలాంటిది కూడా ప్రభుత్వాలు ఆర్టీసీ యాజమాన్యాలు మమ్మల్ని పట్టించుకునే పాపను పోలేదు. కష్టతరమైన ప్రయాణాలతో చదువుకోవాల్సిన పరిస్థితి ఉంది. బస్సు రాక లేటుగా కాలేజీలో చేరుకుంటున్నాము.

-శరవణ, విద్యార్థి, పిచ్చాటూరు మండలం

సాగు భూములకు పట్టాలు ఇప్పించండి



ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి సిపిఎం నాయకులు మెలుగు రమేష్ వినతి

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండలంలోని అంబాకం, పేరడం, వా నెల్లూరు గ్రామాలలోని దళితులకు, గిరిజనులకు ఇంటి స్థలాలు, అనుభవంలో ఉన్న సాగు భూములకు పట్టాలు పంపిణీ చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో విజ్ఞప్తి చేశారు. మంగళవారం సత్యవేడు ఎంఎడీవో కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి దాసరి జనార్ధన్, సత్యవేడు ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్, అరుణాచలం ఆధ్వర్యంలో దళిత గిరిజనుల చేత అర్జీలు ఇప్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ళ తరబడి దళితులు, గిరిజనులు ఇంటి స్థలాలు, అనుభవంలో ఉన్న సాగు భూములకు డీకేటి పట్టాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇస్తున్నట్లు ప్రకటించింది గాని ఆచరణలో ఇంతవరకు ఎక్కడ ఇవ్వలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇంటికి మూడు సెంట్లు, మంజూరు చేసి, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలుమంజూరు చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకుల కృష్ణయ్య భాస్కర్, అమూల్ రోస్లిన్, కొల్లాపూర్ లక్ష్మీ, సుశీల, అరుల్, మహేంద్ర, బాలు, డి దేవాన్, మిన్నల తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులుగా గంజి మాధవయ్య

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గంజి మాధవయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు రోజుల క్రితం తిరుపతిలో జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అధ్యక్షుడు జి.వి. నాగేశ్వరరావు ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం గంజి మాధవయ్య పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో ఈయన పుత్తూరు మండల అధ్యక్షులుగా, ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ శాఖ డైరెక్టర్‌గా, తెలుగుదేశం పార్టీ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులుగా సేవలందించారు. పద్మశాలి సామాజిక వర్గ అభ్యున్నతికి ఆయన చేసిన విశేష కృషిని గుర్తించి మాధవయ్యను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాధవయ్య ఎన్నిక పట్ల రాష్ట్రస్థాయి నాయకులు పలువురు హర్షం వ్యక్తం చేస్తూ ఆయన సహకారంతో సంఘం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా మాధవయ్య మాట్లాడుతూ పద్మశాలి కులస్థుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని, పద్మశాలి సంక్షేమ సంఘం సభ్యత్వ నమోదు ద్వారా గ్రామ, మండల, జిల్లా స్థాయి నుంచి సామాజిక వర్గాన్ని ఏకతాటి పైకి ఐక్యత సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ హోదాలో పద్మశాలి సామాజిక వర్గంలో నేత జీవనాన్ని కొనసాగిస్తున్న వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా నేత పనిలో ఆధునిక పద్ధతులను అమలు చేయటంతో పాటు ప్రభుత్వం నుంచి సహాయ, సహకారాలను అందిస్తామని తెలిపారు.

నిధులు వచ్చాయి.. డ్రైనేజీ సమస్యలు లేకుండా చేయండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని పుత్తూరు మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి సూచించారు. మంగళవారం పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయ ప్రకాష్‌లఅధ్యక్షతన నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాన్ని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పై అంతస్తుల భవనాన్ని పూర్తి చేయాలని తెలిపారు. నగరంలో వీధి కుక్కలు, కోతులు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కౌన్సిలర్లు పట్టణ పరిధిలోని వివిధ సమస్యలపై చర్చించారు.

సమస్యలు పరిష్కారానికి బ్యాంకు ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బ్యాంకు ఉద్యోగులు మంగళవారం, దేశ వ్యాప్త ఆందోళనలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిలోని అంధ్రాబ్యాంక్, రామానుజి సర్కిల్ శాఖ వద్ద యుఎఫ్‌బియు బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వరంలో ధర్నా నిర్వహంచారు. టిబిఈసిసి ప్రధాన కార్యాదర్శి జె.ధన్వంత్ కుమార్, అధ్యక్షులు విజయభాస్కర్ ధర్నా కార్మక్రమంలో ప్రసంగంచారు. కార్మికులు, ఉద్యోగులకుకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు స్వస్తి పలకాలని కోరారు.తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించవద్దన్నారు. బ్యాంకులను బలోపేతం చేయాలని, రుణాలను ఎగగొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బ్యాంకు డిపాజిట్లపై వడ్డీని పెంచాలని, శాశ్వత ఉద్యోగాలను అవుట్ సోర్స్ చేయవద్దని, బ్యాంకుల్లో వెంటనే ఖాళీలను భర్తీ చేపటాలని కోరారు. బ్యాంకు ఉద్యోగులకు ఎన్ పి ఎస్ రద్దు చేయాలని, బ్యాంకులకు కార్పొరేట్ కంపెనీలు భారీ కార్పొరేట్ల ఎన్ పిఏ వసూలు చేయాలని డిమాండ్ చేశారు. వారానికి ఐదు రోజుల పని దినాన్ని వర్తింపు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బ్యాంకు ఉద్యోగుల సమన్వయి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన దేశవ్యాప్త సమ్మెలో టిబిఈసి సభ్యులు జనార్ధన్, సుములత, భాస్కర్, రేష, నందగోపాల్, కేశవరెడ్డి, నిర్మల,మహేష్, వాగ్నేష్ భాస్కర్, పవన్, వేంకట లక్ష్మి, పాల్గొన్నారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మితో కలిసి స్థానిక పార్లమెంట్ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దివాకర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్వాకం వల్ల ఆంధ్ర రాష్ట్రం 20 సంవత్సరాల వెనక్కి వెళ్లిందన్నారు. పెట్టుబడుల రప్పించడంలో ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తోందని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు, కాగ్నిజెంట్ వంటి కంపెనీల శంకుస్థాపన ద్వారా పెట్టుబడుల ఆంధ్ర రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించి, రాష్ట్రమంతట నూతన పట్టదారుల పాసు పుస్తకాలను అందిస్తున్న ఘనత సీఎం నారా చంద్రబాబుదని తెలిపారు. ప్రభుత్వ ఏర్పాటయిన తర్వాత దాదాపు 4000 కి.మీ రోడ్లను నిర్మించడం జరిగిందన్నారు. తిరుపతి పార్లమెంట్ అధ్యకురాలు పనబాక లక్ష్మి మాట్లాడుతూ తమది స్త్రీ పక్షపాత ప్రభుత్వం అన్నారు. మహిళలకు ఉచిత బస్, దీపం పథకం ద్వారా సంవత్సరానికి 3 సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అమలు చేయడం ద్వారా, అటు విద్యార్థులకు చదువునందిచడం, ఇటు రైతులకు మేలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ,తిరుపతి పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్ ఎ యశ్వంత్ రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన భూసార పరీక్షల అవగాహనా సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థినిలు స్వయంగా భూసార పరీక్షలు చేసి ఫలితాలను తెలుసుకున్నారు. వ్యవసాయ భూములు సారవంతంగా ఉండాలంటే భూసార పరీక్షలు ఎంత అవసరమో ఈ అవగాహన సదస్సు ద్వారా తెలియజేశారు. అదేవిధంగా వ్యవసాయ రంగంలో మెరుగైన ఉద్యోగ అవకాశాలు కూడా ఉంటాయని ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఆగ్రో లిమిటెడ్ అధికారి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో విజయోత్సవ సంబరాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ప్రజల ఆకాంక్షను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ నెరవేర్చారని దీనికోసం నాయకులు గంగా ప్రసాద్ ఎంతో కృషి చేశారని మంత్రివర్గ కమిటీ సభ్యులకు మంత్రులు రామనారాయణరెడ్డి, నారాయణ, బీదా రవిచంద్రకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపినందుకు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. చిల్లకూరు జాతీయ రహదారి వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు డ్రోన్ ద్వారా పాలాభిషేకం చేశారు. టవర్ క్లాక్ సెంటర్ వద్ద జేఏసీ సభ్యులను ఎమ్మెల్యే కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నివాళి అర్పించారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలన్న ప్రజల ఆకాంక్షను అసెంబ్లీలో కూడా మాట్లాడానని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి ప్రజల కోరికను తెలియజేశామని వెల్లడించారు. ఈ విషయంలో నాయకులు గంగా ప్రసాద్ ముఖ్యమంత్రి, నారా లోకేష్ తో చర్చించారని గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలన్న డిమాండ్‌తో జేఏసీగా ఏర్పడి ఉద్యోగస్తులు, వ్యాపారులు, విద్యార్థి సంఘాలు శాంతియుతంగా తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి ,శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, చెంచురామయ్య, రహీం, లీలావతి, శ్రావణి, కల్పన, టిడిపి అనుబంధ సంఘాల సభ్యులు కార్యకర్తలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

డిజిటల్ మార్కెటింగ్ స్కిల్ డెవలప్మెంట్ కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం యస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సుధారాణి ఆధ్వర్యంలో డిజిటల్ మార్కెటింగ్‌పై స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సును మంగళవారం ప్రారంభించారు. ఈ కోర్సుకి 7 ప్రొటెక్ డిజిటల్, ఐటి సొల్యూషన్స్, తిరుపతి కంపెనీకి చెందిన సిబ్బంది మధులిక, హరీష్‌లు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ఈ కోర్సులో శిక్షణ పొందారు. కోర్సు కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ ఎం. ప్రశాంత కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

బొజ్జల కల నెరవేరింది : స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి పరితపించేవారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఆయన కుమారుడు బొజ్జల సుధీర్ రెడ్డి పాలనలో ఆలయ ఆదాయం రూ. 250 కోట్లకు చేరుకుందనీ, బొజ్జల కల నెరవేరిందని చెప్పారు. అయ్యన్నపాత్రుడు మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. ఆయనకు ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి - కోట : ఉత్తమ కార్యకర్త ప్రశంసా పత్రం అనేది తెలుగుదేశం పార్టీ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్న కార్యకర్తలకు ఇచ్చే గుర్తింపు. ఈ నేపథ్యంలో కోట మండలం, వెంకన్నపాలెం గ్రామానికి చెందిన సర్పంచ్ కోకర్ల మధు యాదవ్‌కు ఉత్తమ కార్యకర్త ప్రశంస పత్రంను గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నారా లోకేష్‌లు అందించిన ఉత్తమ కార్యకర్త ప్రశంసా పత్రాన్ని గూడూరులో ఉత్తమ కార్యకర్తలకు అందజేయడం జరిగిందని కోకర్ల మధు యాదవ్ తెలిపారు. కోట మండలంలో వెంకన్నపాలెం గ్రామానికి చెందిన సర్పంచ్ కొకర్ల మధు యాదవ్, ఉత్తమ నెల్లూరు గ్రామానికి చెందిన పొక్కాళి సుధాకర్ శెట్టి, చెందోడు గ్రామానికి చెందిన శ్రీనివాసులు, ఇల్లకూరు పాడు దామరపు బాబులకు ఉత్తమ కార్యకర్త ప్రశంసా పత్రాలు అదించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి -కోట : చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కోట తహశీల్దార్ కటారి జయ జయ రావు సూచించారు. మంగళవారం కోట మండలంలోని సిద్దవరం పంచాయతీ పరిధి, ఎస్టీ కాలనీలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాహశీల్దార్ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను పట్టించుకోవద్దన్నారు. అలాగే గ్రామాల్లో ఒకరికొకరు కలిసికట్టుగా జీవనం సాగించాలని, గొడవలకు దూరంగా ఉండాలని గ్రామస్తులకు తెలియజేశారు. అంతేకాకుండా పలు అంశాలపై గ్రామస్తులకు తాహశీల్దార్ అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాహాసిల్దార్ మల్లికార్జునరావు, మండల సర్వేయర్ గోపిరెడ్డి, ఆర్ఐ ప్రసాద్, సిద్దవరం పంచాయతీ సర్పంచ్ ఇంగిలాల సుజాత,కాలనీవాసులు పాల్గొన్నారు.

మండలాల విభజనపై హర్షం

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను నెల్లూరు జిల్లాలో కలపడం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చొరవతోనే సాధ్యమైందని ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. రాపూరులో మంగళవారం కూటమి నాయకులు, జేఏసీ సభ్యులు ఎమ్మెల్యేతో సీఎం, లోకేష్ బాబు, డిప్యూటీ సిఎంల ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ ప్రజల అభీష్టం మేరకే మండలాల పునర్విభజన చేశారని తెలిపారు. కలువాయి, సైదాపురం మండలాల టీడీపీ నేతలు కేక్ కట్ చేసి ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలం, వెంకటాపురం పంచాయతీ, అన్నాసామి పల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం లైన్స్ క్లబ్ ఆఫ్ రేణిగుంట జంక్షన్ ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ జూలియన్ రాజు మాట్లాడుతూ లైన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా పేద విద్యార్థులకు పరీక్షల సమయంలో ఉపయోగపడే పరీక్షా సామాగ్రిని పంపిణీ చేసినట్లు తెలిపారు. సహకరించిన లైన్స్ క్లబ్ సభ్యులకు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ రేణిగుంట జంక్షన్ సెక్రెటరీ రాజేంద్రన్, ట్రెజరర్ కోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ నవీన్, ఉపాధ్యాయులు శోభ తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : గరుడ వారధిపై రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు జీవకోన, రాజీవ్ గాంధీ కాలనీకి చెందిన నాగరాజు, చంద్రకళ దంపతులు వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని అప్పలాయగుంట, కళ్యాణ వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు మంగళవారం వేకువజామున గరుడవారధిపై ద్విచక్రవాహంలో వెళుతున్నారు. వెనక వైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో చంద్రకళ (40) తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. భర్త నాగరాజుకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఈస్ట్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాగులో గుర్తుతెలియని మహిళ మృతదేహం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి రూరల్ మండలం, ఊరందూరు గ్రామ సమీపంలోని ఈదుల వాగులో ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు కాలువలోంచి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి తరలించారు. మహిళ రెండు రోజుల కిందట చనిపోయి ఉంటుందని పోలీసుల భావిస్తున్నారు. మృతురాలి వయసు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందనీ, వరి నాట్లు వేసేందుకు వచ్చిన వలస(ఒరిస్సా) కూలీగా అనుమానిస్తున్నారు. అయితే మహిళ కాలువలో పడి మరణించడానికి గల కారణాలను తెలుసుకుంటున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి - నాయుడు పేట: జిల్లా ప్రత్యేక ఎరువుల తనిఖీ బృందం నాయుడుపేట పట్టణంలోని ఎరువుల షాపులలో మంగళ వారం తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా డి.హెచ్ సి, ఏడిఏ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా వ్యవసాయ అధికారి వేణుగోపాల్‌తో కలిసి జిల్లా ప్రత్యేక బృందం నాయుడుపేటలో ఎరువులు షాపులు తనిఖీలు చేపట్టారు ఈ తనిఖీలలో పట్టణంలోని వివిధ షాపులలో రిజిస్టర్ పరిశీలించారు. కొన్ని షాపులలో సరియైన అకౌంట్స్ చూపని దాదాపుగా 28 లక్షల 78 వేల రూపాయలు నువ్వు చేసే సరుకులను గుర్తించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఎరువులు షాపులలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రికార్డులు మెయిన్టైన్ చేయాలని లేనిపక్షంలో ప్రతి ఒక్కరిపై చట్టరిచ్చా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట వ్యవసాయ అధికారి జె.గణేష్ సిబ్బంది పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న నేతలు

ప్రజాశక్తి - నాయుడు పేట: నాయుడుపేట పట్టణం, చంద్రబాబు నాయుడు నగర్, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ముక్కోటి వైకుంఠ ఏకాదశి వేడుకలు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కామిరెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు పి చంద్రారెడ్డి,పాలేటి.నాగార్జున,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల.సుబ్బారావు, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు అవధానం.సుధీర్,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ సభ్యులు సర్వోత్తమ రెడ్డి, ఆబోతుల బాబు సాయినాయుడు, ఉచ్చూరు సంపత్ రెడ్డి, పలువురు నాయకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పూజారులు స్వామి వారికి పూజలు చేసి నాయకులను ఆశీర్వదించి,తీర్థ ప్రసాదాలు అంద జేశారు.

శ్రీవారి భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి, అలిపిరి వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీశ్రీనివాస అధ్వర్యంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని కాలినడకన తిరుమలకు వెళ్లే సుమారు 500 మంది భక్తులకు అన్న దానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ అంతర్జాతీయ సేవా సంస్థ అని, పేదవాని ఆకలి తీర్చేందుకు లయన్స్ క్లబ్ ముందుంటుందని తెలిపారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీవారి భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

In the Court of the VII Addl. District Judge : Gudur

E.P.No. 47 / 2018

Arbitration Case No. 09 / 2016

M/s. **Shriram City Union Finance Ltd.,** Rep.by its **GPA Holder / Authorized Signatory, S.V. Subbaiah** - Award - Holder

Vs

1. M.Penchala Narasa Reddy
2. K.Padma
3. M.Surekha - J.Drs

వేలం ప్రకటన

పై నెంబరున అవార్డు హోల్డర్ డిక్రీ బాకీ రాబట్టు కొనుటకు 1వ జె.డి.ఆర్ తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తులను **తే31-12-2025**దిన **ఉదయం 10.30 గంటల** నుండి **సాయంత్రం 5 గంటల** లోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలం పాట జరుపబడును. కావున పాటదారులు ఎవ్వరైనా వేలంపాటలో పాల్గొని పాటపాడుకొనవచ్చును.

SCHEDULE OF PROPERTY

Sri Potti Sriramulu Nellore District, Gudur Regn. District, Gudur Sub District, East Gudur Mandal, Potupalem Village, Accounts, S.No. 1947/6, an extent of Ac. 4.70 cents S.No. 1947/8 an extent of Ac.0.56 cents and S.No. 1949/1 an extent of Ac. 2.91 cents in total extent Ac. 8.17 cents in this

Item No.1: Plot No.8 an extent of 2995 sq.ft., or 332.777 sq.yards., **Bounded on:- East :** 30 ft. wide layout road, **West:** Site for Public Purpose, **North:** Plot No.9, **South:** Road laid from Nelcast to Chillakur.

Item No.2: Plot No.9 an extent of 2000 sq.ft., or 222.222 sq.yards., **Bounded on:- East :** 30 ft. wide layout road, **West:** Site for Public Purpose, **North:** Plot No.10, **South:** Plot No.8.

Item No.3: Plot No.55 an extent of 2400 sq.ft., or 266.666 sq.yards., **Bounded on:- East :** Plot No.67, **West:** 30 ft. wide layout road, **North:** Plot No.54, **South:** Plot No.56.

Item No.4: Plot No.57 an extent of 2400 sq.ft., or 266.666 sq.yards., **Bounded on:- East :** Plot No.65, **West:** 30 ft. wide layout road, **North:** Plot No.56, **South:** Plot No.58.

Item No.5: Plot No.117 an extent of 2400 sq.ft., or 266.666 sq.yards., **Bounded on:- East :** Plot No.123, **West:** 30 ft. wide layout road, **North:** Plot No.118, **South:** Plot No.116.

Item No.6: Plot No.118 an extent of 2400 sq.ft., or 266.666 sq.yards., **Bounded on:- East :** Plot No.122, **West:** 30 ft. wide layout road, **North:** Plot No.119, **South:** Plot No.117.

Item No.7: Plot No.124 an extent of 3025 sq.ft., or 336.111 sq.yards., **Bounded on:- East :** 30 ft. wide layout road, **West:** Plot No.116, **North:** Plot No.123, **South:** Land in S.No. 1949/2.

Item No.8: Plot No.133 an extent of 2033 sq.ft., or 225.888 sq.yards., **Bounded on:- East :** Nelcast Road, **West:** Plot No.125, **North:** Plot No.132, **South:** Land in S.No. 1949/2.

Item No.9: Plot No.15 an extent of 1170 sq.ft., or 130 sq.yards., **Bounded on:- East :** Plot No.31, **West:** 30 ft. wide layout road, **North:** Land in S.No. 1949/2, **South:** Plot No.16.

Item No.10: Plot No.31 an extent of 1050 sq.ft., or 116.666 sq.yards., **Bounded on:- East :** 30 ft. wide layout road, **West:** Plot No.15, **North:** Land in S.No. 1949/2, **South:** Plot No.30.

DHR Value of Rs.7,00,000/-
Amin Value of Rs.18,00,000/-
Market Value of Rs.3,32,777/-

బి.బాలప్రదీప్, ఎం.బి.ఎ., ఎల్.ఎల్.ఎం.,
డిక్రీ హోల్డర్ తరపు అడ్వకేట్, గూడూరు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :ప్రతి ఒక్కరు చట్టాల పై అవగాహన పెంచుకోవాలని గూడూరు తహసీల్దార్ ప్రసాద్ పేర్కొన్నారు. గూడూరు మండల పరిధిలోని రెడ్డి గుంట గ్రామంలోని ఎస్టీ కాలనీ లో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ అన్నదమ్ములగా ఉండాలన్నారు.పౌరుల కు ఉన్న హక్కులు, చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు.సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీ సభ్యులు అరవ పార్వతయ్య, ఏసుపాక పెంచలయ్య , వెంకటేశ్వర్లు ,తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నుడి సేవలో బియ్యపు కుటుంబం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని తొండమనాడులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామిని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సతీమణి శ్రీవాణి రెడ్డి, కుమార్తె శ్రీపవిత్ర రెడ్డి, మనవడు దేవన్యంద రెడ్డిలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. బ్రి సుదర్శన్ రెడ్డి, జైచంద్రారెడ్డి, నారాయణ, భాస్కర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మహేష్, సుబ్బానాయుడు కంచ్రి వేణు, జయ కృష్ణ రెడ్డి, బలరాం, చంగల్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో వైభవంగా ఏకాదశి వేడుకలు

ప్రజాశక్తి - సత్యవేడు: శ్రీసిటీలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, హరినామ స్మరణతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో పరవశించాయి. భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకుని స్వామివారి కృపను పొందారు. వైకుంఠ ఏకాదశి పూజా కార్యక్రమాలలో పరిసర గ్రామాల ప్రజలు చురుగ్గా పాల్గొని విజయవంతం చేయడం పట్ల డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. అయ్యప్ప తరచూ సందర్శించి స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన శ్రీసిటీ పారిశ్రామిక కమ్యూనిటీకి పిలుపునిచ్చారు. భక్తులకు తీర్థ, అన్న ప్రసాదాలు అందించారు. శ్రీసిటీ ప్రతినిధులు పి.బి.శాస్త్రి, పల్లెటి బాలాజీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జనవరి 3న యోగధ సత్సంగ ధ్యానమందిరం ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆధ్యాత్మిక నగరం తిరుపతి నలంద నగర్‌లో నూతనంగా నిర్మించిన యోగధ సత్సంగ ధ్యాన మందిరం జనవరి 3 2026న ప్రారంభోత్సవం కానుందని యోగద సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా సభ్యులు ప్రొఫెసర్ పి.రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరమహంస యోగానంద బోధనలకు అంకితం చేయబడిన మందిరాన్ని యోగద సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియాకి చెందిన పూజ్య సన్యాసుల నేతృత్వంలో ప్రజలకు అంకితం చేయనున్నారని అన్నారు. విశాలమైన ధ్యాన మందిరాలు ధ్యానం కోసం పిన్ డ్రాప్ సైలెన్స్ ఉండేలా ప్రత్యేక శబ్ద నియంత్రణతో నిర్మించబడి దన్నారు. తిరుపతి ప్రజలకు ఈ ధ్యాన మందిరం ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో చల్లా హరిశ్చంద్ర, శేషాచలపతి, ప్రొఫెసర్ శ్రీనివాసులు, ప్రకాష్ నాయుడు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - సత్యవేడు: ప్రజా సమస్యలను పరిష్కారమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ప్రజా దర్బార్ కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మంగళవారం సత్యవేడు ఎంపీడీవో చంద్రశేఖర్, తహశీల్దార్ రాజశేఖర్ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజల నుండి సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలు సమస్యలపై మొత్తం 139 మంది అర్జీలు సమర్పించారు. ఇందులో ఇంటి స్థలాలు, భూ సమస్యలపై 110 మంది అజ్జీదారులు అర్జీ సమర్పించగా కొత్త పెన్షన్ల కొరకు 26 మరియు బోర్లు మురుగునీటి కాలువలకు సంబంధించి మూడు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించి సుస్థిర పాలనను అందజేయాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాలలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వినతులు అందించిన ప్రతి ఒక్కరి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అలాగే మండలంలోని ప్రతి గ్రామానికి చెందిన నాయకులు సమస్యలను గుర్తించి పరిష్కరించ బడేటట్లు ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మండలంలో బడుగు బలహీన వర్గాలకు చెందిన అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం, అనుభవంలో ఉన్న సాగు భూములకు పట్టాలు అందించే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని తెలిపారు. అలాగే గ్రామాలలోని భూ సమస్యలు, స్మశానానికి దారి, నీటి బోర్లు, సీసీ రోడ్లు నిర్మించాలని తెలిపారు. ఇదివరకే పలు గ్రామాలలో కూటమి ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమం ద్వారా సిసి, లింక్ రోడ్లు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను మండలంలో చేపట్టిందన్నారు. ఇప్పటికే వి ఆర్ కండ్రిగ నాగలాపురం రోడ్డు, జడేరి రోడ్డుకు భూమి పూజ చేసి పనులు ప్రారంభమైందన్నారు. మరికొన్ని రోజుల్లో చిన్నపాండూరు టు నాగలాపురం రోడ్డు భూమి పూజ చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగ 2.0 కార్యక్రమం ద్వారా గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. అలాగే కొత్త పెన్షన్స్, నిరుపేదలకు ఇంటి తరాలు కేటాయించి పక్కా గృహాల నిర్మాణం ఉంటే పలు సంక్షేమ పథకాలను సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి అర్జీ దారి నుండి వినతులు స్వీకరించి సత్వరమే పరిష్కరించవలసిందిగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు మండల ఎంఈఓ రవి, ఎంఈఓ 2, పలు శాఖల ప్రభుత్వ అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

మంగళవారం ఆరు లక్షల వ్యయంతో కూడిన సత్యవేడు మండలంలోని విఆర్ కండ్రిగ ఎస్టి కాలనీ సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. సత్యవేడు పట్టణంలోని నరసరాజు అగ్రహారంలో ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్ఫార్మర్ ను ప్రారంభించారు. తదనంతరం సత్యవేడు- మదనపల్లి ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించారు. గత కొద్దిరోజులుగా ఈ బస్సు సర్వీసు ఆగి ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవ తీసుకొని బస్సు సర్వీసును మరల ప్రారంభించడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

గాయత్రి బ్రాహ్మణ సంఘానికి అపూర్వ గౌరవం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్యలో పుత్తూరు గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సేవా సమాఖ్య సంఘానికి అపూర్వ గౌరవం దక్కింది. ఈ సంఘంలో ముగ్గురు సభ్యులకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించడం పట్ల తిరుపతి జిల్లా అధికార ప్రతినిధి బాలాజీ శర్మ, సంయుక్త కార్యదర్శి బాలాజీ రావు పుత్తూరు గౌరవం పెరిగిందని తెలియజేశారు. తిరుపతి జిల్లా, సూళ్లూరుపేటలో మంగళవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం గౌరవ సలహాదారు ఆలూరి రామకృష్ణను, తిరుపతి జిల్లా తరఫున రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు పుత్తూరు బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన వెల్లడించారు. ఏకగ్రీవంగా ఆమోదం పాటు మరో ఇద్దరికి రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించడం చాలా సంతోషంగా ఉందని, తమకు అప్పగించిన ఈ బాధ్యతలను పక్షపాతం లేకుండా పుత్తూరు పరిసర ప్రాంతాల బ్రాహ్మణ సభ్యుల సంక్షేమ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షులు ఇసుకపల్లి కామేశ్వర ప్రసాద్కు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేదం హరి ప్రసాద్కు, కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎస్‌టియు రాష్ట్ర నాయకత్వంలో తిరుపతి జిల్లాకు పెద్ద పీట

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: కడప జిల్లాలో జరిగిన ఎస్ టి యు 79వ రాష్ట్ర వార్షిక కౌన్సిల్ సమావేశంలో తిరుపతి డివిజన్‌కి చెందిన గాజుల నాగేశ్వరరావు ఎస్టీయు రాష్ట్ర సహాధ్యక్షులుగా, రాష్ట్ర మహిళా కన్వీనర్‌గా పి.రేణుకాదేవి ఎన్నికయ్యారు. తిరుపతి జిల్లా పరిధిలో డివిజనల్ కన్వీనర్లుగా తిరుపతి డివిజన్ నుండి బిక్కా మురళి, శ్రీకాళహస్తి డివిజన్ నుండి ఎస్.నాగూర్, పుత్తూరు డివిజన్ నుండి వి.వెంకటరమణ, వెంకటగిరి నుండి చెంచురత్నయ్యలు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల తిరుపతి జిల్లా ఎస్టీయూ రేణుకా దేవి, ప్రధానకార్యదర్శి మునికృష్ణనాయుడు, జిల్లానాయకులు మురళీకృష్ణ, వాసు, రామాంజ నేయులు, ద్రాక్షాయణి జగన్నాధం, విజయ్ భాస్కర్, తదితరులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మునికృష్ణ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర సహాధ్యక్షులుగా ఎన్నికైన గాజుల నాగేశ్వరరావు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎస్టీయూ వ్యవస్థాపకుల్లో తొలితరం సీనియర్ నాయకులుగా రాష్ట్ర సంఘంలో పలు హోదాల్లో విశేష సేవలు అందించారని, ఉపాధ్యాయ వాణి పత్రిక ప్రధాన సంపాదకులుగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు తమ సంపాదకీయాలతో చైతన్యం కలిగించారు. యువత, మహిళ, పెన్షనర్లకు సంబంధించి ప్రత్యేక శీర్షికలతో రాష్ట్ర స్థాయిలో మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. తిరుపతి డివిజన్ నుంచి రాష్ట్ర నాయకులుగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్టీయు పరంగా కృషి చేయడానికి అవకాశం లభించిందని పేర్కొన్నారు.

రాష్ట్ర మహిళా కన్వీనర్ పి.రేణుకాదేవి

రీ సర్వే గ్రామ సభ పై అవగాహన

ప్రజాశక్తి -కోట : కోట మండలం, సిద్దవరం పంచాయతీ పరిధిలో రీ సర్వే గ్రామ సభ పై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోట తహశీల్దార్ కటారి జయ జయ రావు హాజరయ్యారు. అనంతరం తహశీల్దార్ కటారి జయ జయ రావు రీ సర్వే పై పలు అంశాలను రైతులకు వివరించారు. అంతేకాకుండా రైతులకు సంబంధించిన భూమి వివరాలను ముందస్తుగా రెవెన్యూ అధికారులకు తెలియజేసి రీ సర్వే సమయంలో ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండాలన్నారు. అదేవిధంగా భూములకు చెందిన పలు సమస్యలను తెలియపరచాలన్నారు. భూ సమస్యలు ఏమైనా ఉంటే తక్షణమే పరిష్కరిస్తామని రైతులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాహశీల్దార్ మల్లికార్జునరావు, మండల సర్వేయర్ గోపిరెడ్డి, ఆర్ఐ ప్రసాద్, స్థానిక సర్పంచ్ ఇంగిలాల సుజాత గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలం, జమీన్ కొత్తపాలెం, ఎస్టీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. అనంతరం వారి సమస్యలపై ఇచ్చిన అర్జీలకు తక్షణమే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్, మండల పరిషత్ ఏవో శ్రీనివాసులు, యంఈవో నసీమాలి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్ యాదవ్, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ బొకేలు బాధ్యతను తెలుపుతున్నాయి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రవాణా శాఖ నిబంధనల మేరకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధారణ చేయాలని, ఇష్టమైన వారికి ప్రేమతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపే సమయంలో హెల్మెట్ బొకేలు ఇవ్వడం వలన వారిపై ఉన్న బాధ్యతను, ప్రయాణంలో హెల్మెట్ ఆవశ్యకతను తెలిపేలా చేసిన ఈ నూతన ఆవిష్కరణ బాగుందని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ పేర్కొన్నారు. మంగళవారం తిరుపతి నగర పరిధిలోని తిలక్ రోడ్‌లో ఉన్న బ్లూ పెటల్స్ ఫ్లోరిస్ట్ నిర్వాహకులు సాయి కుమార్ రెడ్డి వినూత్న రీతిలో ఆలోచన చేసి వ్యాపార ధోరణితో కాకుండా సమాజ హితం కోసం హెల్మెట్ బొకేలు తయారుచేసి ఒక ప్రాముఖ్యతైన సందేశాన్ని ప్రేమతో తెలిపే విధంగా ఉందని అభిప్రాయపడ్డారు. ఇటీవల జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు కూడా హెల్మెట్ ధారణ తప్పనిసరి అని, హెల్మెట్ లేనిదే పెట్రోల్ పట్టకుండా తీసుకున్న చర్యలు నగర ప్రజల్లో మంచి పరిణామాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ సందర్భంగా సాయికుమార్ రెడ్డి మాట్లాడుతూ మనకు ఇష్టమైన వారు రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాలకు రక్షణగా నిలిచే హెల్మెట్ ఆవశ్యకతను ప్రేమపూర్వకంగా తెలిపే పద్ధతితో ఉండాలని ఈ ఆలోచన చేశామన్నారు. ఇది సత్ఫలితాలు ఇస్తుందని ఆశిస్తున్నామన్నారు. అందరికీ అందుబాటు ధరలలో ఈ హెల్మెట్ బొకేలు తమ వద్ద ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రవాణా శాఖ అధికారి మురళీమోహన్ కు హెల్మెట్ బొకేను అందిస్తున్న దృశ్యం

ముక్కంటి సేవలో నాయకులు

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలంలోని పలు దేవాలయాల్లో ముక్కోటి ఏకాదశి ఘనంగా నిర్వహించారు. వాకాడు శివాలయంలో వాకాడు దేవాలయాల చైర్మన్ నెల్లూరు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో స్వామివారి సేవలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి , మాజీ సర్పంచ్ భార్గవ్ రామ్, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వాకాడు హరిజనవాడలో వెలసి ఉన్న చెన్నకేశవ స్వామి గుడిలో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురు మల్లి రామ్ కుమార్ రెడ్డి స్వామివారి సేవలో పాల్గొన్నారు. ప్రజలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాపా రెడ్డి రాజశేఖర్ రెడ్డి వైసీపీ మండల కన్వీనర్ ఏసుగు సుధాకర్ నాయుడు ,గూడూరు సుధాకర్ రెడ్డి, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిజేలకు అనుమతి లేదు

ప్రజాశక్తి - వాకాడు: తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, గూడూరుడిఎస్పి గీతా కుమారి ఆదేశాల మేరకు వాకాడు సబ్ ఇన్స్పెక్టర్ నిఖిల్ బాబు మండల ప్రజలకు మంగళవారం హెచ్చరికలు జారీ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా రాత్రి డీజేలు కానీ, పార్టీలు గాని నిషేధించడం జరిగిందని వాటికి ఎలాంటి అనుమతులు లేవని తెలిపారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని సూచించారు. రోడ్లపై ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తూ మద్యం తాగి వాహనాలు నడపరాదు, అత్యధిక వేగంతో వాహనాలు నడపకుండా జాగ్రత్త వహించాలి అని, ఏదైనా గొడవలు చేసిన ఎడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.